తెలంగాణా కవిత్వం

# నెగడు

చింతం ప్రవీణ్

కల్పన ప్రచురణలు
శివనగర్, వరంగల్.

# నెగడు

(తెలంగాణా కవిత్వం)

చింతం ప్రవీణ్

కల్పన ప్రచురణలు
శివనగర్, వరంగల్.

వెల : 50/–

ప్రథమ ముద్రణ
ఫిబ్రవరి, 2012.

**NEGADU**
*( Collection of Telangana Poems )*
Poet: **Chintham Praveen**

First Edition : **February, 2012**
Rs : **50/-**

Cover Image : **MOHAN**
DTP & Lay Out : **Sneha Graphics, Hyderabad .**
Printing : **PRINT MAX, R.T.C 'X'Road Hyderabad, Ph: 9866187088**

*For Copies :*
CHINTHAM PRAVEEN
# 16-10-237 Shivanagar,
Warangal 506002
Cell: 9346886143, 9533530001
email:praveen.kuc@gmail.com
&
**All Leading Book Shops**

# కృతజ్ఞతలు

అన్వర్

**ప్రొ॥ కాత్యాయని విద్మహే**
తెలుగు విభాగాధిపతి,కాకతీయ విశ్వవిద్యాలయం

**డా॥ పంతంగి వెంకటేశ్వర్లు** అసిస్టెంట్ ప్రొఫెసర్

**అల్లం రాజయ్య** ప్రముఖ రచయిత

**డా॥ పట్నం శేషాద్రి** జిల్లా రెవిన్యూఅధికారి, వరంగల్

**అంవశయ్య నవీన్** ప్రముఖ రచయిత

**డా॥ బండా ప్రకాష్ ● డా॥ జిలుకర శ్రీనివాస్**

**తిరునహరి శేషు ● ఆకారపు మోహన్**

**పసునూరి రవీందర్ ● మక్కాజి రామరాజు**

**కె.మహేష్ ● గాడిపెల్లి మధు**

**బొట్టు రమేష్ ●చింతం గిరి**

**రామినేని ప్రశాంత్ ● అశోక్ మోరె**

**కందాళ శోభారాణి ● 'సహచరి' జ్యోతి**

***కాకతీయ యూనివర్శిటీ తెలుగు విభాగం***

***కాకతీయ యూనివర్సిటీ బి.సి స్టూడెంట్స్ అసోసియేషన్***

***తెలంగాణా వేదిక***

***ప్రజాకళల వేదిక (పీపుల్స్ ఆర్ట్ థియేటర్)***

***గోదావరి సాహితీ మిత్రులు***

***నవసమాజ్ సేవాసమితి***

## అంకితం

నాయనమ్మ 'శాంతవ్వ'కు

# మొలకెత్తిన గొంతు - ప్రవీణ్ కవిత్వం

వరంగల్ జిల్లా ఆవేశం పోరాటమైతే, వేయి పోరాటాల ఆవేశం - నా నేల శివనగర్‌ది. చదివి చదవని మధ్యతరగతి మనుషుల బతుకు - నా శివనగర్.

ఈ శివనగర్ ప్రవీణ్ నానమ్మ ఒక ' చింతం శాంతవ్వ'ది.

శాంతవ్వ కొడుకు ' చింతం రాజేశం'ది.

చింతం రాజేశం కొడుకు ' చింతం ప్రవీణ్'ది.

ప్రవీణ్‌కు నేను నిలువెత్తు, లోతైన అద్దాన్ని - తన బింబ ప్రతిబింబాల్ని నాలో చూసిండో లేడో కానీ...

నాకు ప్రవీణ్ బాల్యం, ఇప్పటి వర్తమాన జీవితం తెలుసు-

శివనగర్ నేల గంధాన్ని, మనుషుల బంధాల్ని, వీర పౌరుషాల చరిత్రను, స్పృహ కల్గిన శివనగర్ బిడ్డలు నిండా నింపుకొని వరంగల్ జిల్లాతో, తెలంగాణా నేలతో మమేకమై, ఎరుపెక్కిన ఎర్రజెండాలతో పాటు, వివిధ రాజకీయ పార్టీలలో సామాజిక స్పృహతో పాటు, సామాజిక సంఘాలలో ఆత్మగౌరవంతో ముందుకు నడుస్తున్న వాళ్ళలాగే... ' చింతం ప్రవీణ్' సామాజిక రాజకీయ సాంస్కృతిక ఆత్మగౌరవ అవగాహనతో, బహుళ జనుల స్ఫూర్తితో చైతన్యంగా ఉన్నడు. అంతే కాకుండా నలిగిన జీవితాల్ని, పెనవేసుకున్న పేగుబంధాల్ని, మోసపోతున్న దు:ఖాల్ని, నిరంతర అవమానాల్ని, తెలంగాణా పోరుబిడ్డల పోరాటాన్ని 'కవిత్వం' చేసిండు - 'నివురు గప్పిన నిప్పు' తెలంగాణా మహోద్యమాన్ని " నెగడు" చేసిండు.

❁

చింతం శాంతవ్వ భర్త చనిపోయిన తర్వాత ఒక్కతే 'గ్రేన్ మార్కెట్' లో కూలీ పని చేసి కొడుకుల్ని పెంచింది. బిడ్డల పెండ్లిండ్లు చేసింది. ఆ తర్వాత తన పిల్లల కుటుంబాల గురించి, వాళ్ళ పిల్లల గురించి, వాళ్ళ పెండ్లిళ్ళ గురించి తన నడుం వంగిపోయేంత వరకు, శరీరం మొత్తం ముడుతలు పడేంతవరకు కష్టం చేసి సాకింది. కళ్ళముందే ఇద్దరు కొడుకులు చనిపోతే, పెద్దకొడుకు సెటిల్‌కాకపోతే, మూడో కొడుకు కష్టాల పాలైతే, పెద్దబిడ్డకు ఇబ్బందులొస్తే అన్నీ మౌనంగా, ధైర్యంగా తట్టుకున్నది. శాంతవ్వ ఎప్పుడూ శాంతంగా బతకలేదు. కుమిలిపోతూ గడపలేదు. శాంతవ్వ ఇంటి పెద్ద దర్వాజ ముందే కూలిపోయింది - తర్వాతే ఆమె.

రాజేశమన్న డ్రైవర్. లారీ మీద దేశమంతా తిరిగి, సొంతంగా ఆర్టీసీలో ఉద్యోగాన్ని సంపాయించీ... డూటీ దిగి ఇంటికి వస్తూ తాగి రాత్రంతా ఒకటి చేసేవాడు. సమాజం మీది కోపాన్ని, తోటి మిత్రుల నమ్మక ద్రోహాన్ని అన్నీ ఇంట్లో తీసేవాడు. ఆ రాత్రి (అలాంటి రాత్రులెన్నో) మా ఇంటి ముందరి అరుగు మీద స్ట్రీట్‌లైట్ వెలుగులో రాసుకుంటూనో, చదువుకుంటూనో, బొమ్మలేసుకుంటూనో కూర్చున్న నా దగ్గర కూర్చొని నేనేస్తున్న బొమ్మల గురించి ప్రేమగా మెచ్చుకునేవాడు. నన్నెత్తుకునేవాడు. కౌగిలించుకునేవాడు.ఆ కౌగిలింత,ఆ ఎంకరేజ్‌మెంట్ ... నేనిలా రాయడానికి, నిలబడటానికి కారణాలు. కారకాలు. ప్రేరణలు.

ఇదంతా ఒక వైపు ...

ప్రవీణ్ అప్పుడే పుట్టిండు. శాంతవ్వ తన జీవిత కాల శాంతానికై నిమ్మళపడింది అప్పుడే. రాజేశమన్న ఇంకా రెచ్చిపోయింది కూడా ఆ తర్వాతే– ప్రవీణ్‌ను నేనప్పుడప్పుడు ఎత్తుకొని తిరిగేవాణ్ణి.

... ఇంత నేపథ్యం ఉంది ప్రవీణ్ పుట్టడానికి ముందు, చదువుకుంటున్నప్పుడు, యవ్వనంలోకి వచ్చాకా. సహజంగానే తన మీద అనేక విధాల ప్రభావాలు, ప్రాభవాలు, పరికల్పనలు – ప్రభావితం చేసినయ్. ఐతే, ప్రవీణ్ రాజేశమన్నకు అచ్చు. బహిర్గత ప్రతిరూపం.

ప్రవీణ్ సెవన్త్ పాసైనప్పుడు గట్టెక్కిండనుకున్న. టెన్త్, ఇంటర్ తర్వాత కూడా నేను గట్లనే అనుకున్న గట్టెక్కిండని. డిగ్రీ ఆ తర్వాత దోస్తుల కోసం, ఇతరుల కోసం ప్రవీణ్ చేసిన కొన్ని పనులు తన జీవితంలో దిగుడు లోయలు – యవ్వనపు చీకటి రోజులు. అగాధాల్లోకి నెట్టబడినవాడు, బతుకు చీకట్లో మగ్గిపోయిన వాడు, తీవ్ర మానసిక ఒత్తిడిలో దిక్కు దిశ కానరాక కుంగిపోయిన వాడు... మళ్ళీ తన స్వశక్తితో తనకుటుంబం కోసం రెట్టించిన ఉత్సాహంతో పైకెగిసిండు. ఆతర్వాత ప్రవీణ్ చర్యలు... చేతలు పూర్తిగా మారిపోయినయ్. ప్రవీణ్ ఇప్పుడు మార్గదర్శి. కాకతీయ యూనివర్సిటీ ఆణిముత్యం.

కట్ చేస్తే...

నన్నొక రోజు ( 2002) కలిసి ‘ బాబాయ్! నవల రాసిన. మీరు చదివి చెపితే ఎట్లైనా పంపిస్తా’నన్నడు. చేతి రాతతో 200 పేజీలకు పైగా అందగా రాసి బైండింగ్ చేసి తీసుకొచ్చి ఇచ్చిండు. చదివాను ఓపిగ్గా!

కానీ, ఓపిగ్గా జవాబు చెప్పలేకపోయా ప్రవీణ్‌కు 'బాగా చదువు. ఉద్యోగం చేయి. నీమీద చాలా నమ్మకాలు పెట్టుకున్నం.రాయడమైనా, ఇంకేమైనా ఆతర్వాతే' అని చెప్పిన. ఆవిధంగా (నామూలంగా) ఆ నవల అచ్చుకాలేక పోయింది.

❁

తెలంగాణా ఉద్యమంలో కలెతిరిగిండు ప్రవీణ్.

మాటను బలంగా విసిరే ప్రవీణ్ కవిత్వాన్ని కత్తి పదును చేసిండు.

వాస్తవిక కవిత్వాన్ని నిప్పులు విసిరినట్టు విసిరిండు.

మద్యానికి బానిసైన తండ్రి తనను ద్వేషించడం- తండ్రీ కొడుకుల మధ్యన ఉన్న వైరుధ్యాన్ని, తన మనసు గాయాల్ని కవిత్వం చేసిండు ప్రవీణ్.

' నా మెదళ్ళో
నీ ఊహలు కదలాడగానే...
నిశ్చలంగా ఉన్న నన్ను
ఒక్క కుదుపు కుదిపేస్తవ్ కదా నాన్న-
'నాన్నలు బతకాలంటే
కొడుకులు బతకాలి'

'నాయిన ' కవితా సంకలనం-

అమ్మను 'అవనిగా ఆకాశంగా' అన్నింటికన్న మిన్నగా గొప్ప కవితతో మనల్ని ఊపేసిండు.

' ఈ నేల తల్లి నీ స్వేదంతో
ఎంతగా తడిసిపోయిందో
ఎన్ని వేల సముద్రాలు
నీ కన్నీళ్ళను దోసిళ్ళు పట్టాయో కదా'-

అడ్డదిడ్డంగా పెరిగిపోతున్న నగరాలు - నగరాల మూలంగా పెరిగిపోతున్న స్లమ్‌లు - స్లమ్‌లలో బతుకుతున్నవాళ్ళ జీవన చిత్రం- అందమైన ముసుగేసుకున్న నగరాన్ని అడ్డదిడ్డంగా చీల్చి చెండాడిండు.

నగరాన్ని దుమ్ముదులిపి, అటు ఇటు లాగి ఊపి కడిగి ఉతికి ఆరేసి ఇస్త్రీ చేసిండు.

'నగరం
ప్రవహించే డాలర్ల సముద్రం
నిశానిచ్చే కొకైన్ కబంధహస్తం

కాక్‌టైల్ కరాళ నృత్యం–

నగరం ఇప్పుడొక

కసాయితనపు కవాతు జంక్షన్’–

తన యవ్వనాన్ని, తన అమాయకత్వాన్ని, తన స్నేహాన్ని, తన మోసపోయేతనాన్ని ఈ ‘నగరం’ చేసిన గాయాన్ని స్కాన్‌చేసి నగరం నడిబొడ్డు మీద పెట్టిండు.

ప్రవీణ్ జీవితంలో, కవిత్వంలో ఊగిసలాట లేదు

మాటలో, స్నేహంలో దోబూచులాటల్లేవ్. నడక, నడత నిక్కంగా, నిటారుగా ఉంటది. దేశం మీద, సమాజం మీద, మనుషుల మీద ప్రవీణ్‌కు కసి లేదు–ప్రేమతప్ప! కానీ, దేశాన్ని దోచుకుంటున్న, ఉద్యమాల్ని పక్కదారులు పట్టిస్తున్న, విద్యార్థుల్ని వాడుకుంటున్న ‘వాళ్ళను’ మాత్రం చూసిచూడనట్లుండలేడు ప్రవీణ్ – జీవితం నిండా గాయపడి మళ్ళీ జీవితాన్ని పునర్నిర్మించుకున్న ఈ యువకుడు ‘దొంగను చూసి జాలి పడ్తడు’ కానీ ‘ దోచుకుంటున్న వాళ్ళ వెంటపడ్తడు – పట్టు పడ్తడు’

‘ఖాకీ, ఖాదీ చొక్కా మడతల్లో

ముడుతలు పడ్డ జిందగీ నా దేశం–’

‘క్యాపిటల్ మార్కెట్‌లో

ఏ వస్తువైనా విలువైనదే

మనిషి తప్ప–’

ప్రవీణ్ జీవితం సంక్లిష్ట, సందిగ్ధ, తికమకల నుంచి... ఎవరికో ఏదో చేయాలన్న పట్టుదల, ఈ సమాజాన్ని పూర్తిగా తుడిచి, కడిగి ‘మంచి పుస్తకం’ చేయాలనుకుంటున్న ప్రేమార్తి ప్రవీణ్ నిండా ఉంది.

‘ నెగడు’ కవితా సంపుటి నిండా తెలంగాణా ఉద్యమ తీరులు, ఉద్యమ ఆటుపోట్లు, అమరవీరుల త్యాగాలు, ఉద్యమ నాయకులకు సహజంగా ఉండాల్సిన ఆత్మగౌరవ వీరత్వాన్ని పుటం పెట్టిండు ప్రవీణ్.

‘నా తెలంగాణాలో

సూరీడు

నెత్తుర్రై మండుతున్న

వీరుడు’...

‘కట్లే... అంటే

కుక్కసోంటిది

వచ్చిన దారిన వెళ్ళిపోతది

పౌరుషంగా మొఖం తిప్పి చూడకుండ'

చాలా గొప్ప ప్రతీకాత్మక, కవితాత్మక ఈసడింపు

ఉద్యమ వీర పతాక ఆవేశం – ఈ కవితలు.

తెలంగాణా రాష్ట్రాన్ని సాధించుకోవడానికి, ఉద్యమాన్ని నిరంతరం బతికించడానికి, ' ఆత్మ బలిదానాల వల్ల తెలంగాణా రాదని– ఛానళ్ళ విశ్లేషణలు తెలంగాణ ఉద్యమాన్ని నిలువునా ముంచుతున్నాయని' 'మీడియా మాఫియా ' పై

'నడి బజారులో
మంటల్ని కౌగిలించుకుంటున్న
తెలంగాణా యువకుని
నిలువెత్తు ఆత్మబలిదానాన్ని
ఏ ఛానల్ చర్చకు పెట్టదు...
'బ్రేకింగ్ న్యూస్ మీడియాది
బ్రోకెన్ లైఫ్ తెలంగాణాది'–

నన్ను బాగా వెంటాడుతున్న ప్రవీణ్ కవితా వాక్యాలు

• బతకడమనేది ప్రారంభిస్తే
జీవితం అంతమౌతుంది–

• పోలీసు ఠాణాల్లో
నేరాంగీకార పత్రాల్లో
నా ప్రమేయం లేకుండానే
నా వేలి ముద్రలుంటాయ్–

ఇంకా చాలా గొప్ప కవితలు, కవితలలో గొప్ప వాక్యాలు, వెంటాడే వాక్యాలు ఇంకా చాలా ఉన్నయ్ ప్రవీణ్ కవిత్వంలో.

నెగడు 'ధగడు' కావాలి
కవిత్వం ప్రవీణ్ పవర్ కావాలి–

ఇప్పటిదాకా ప్రవీణ్ కవిత్వాన్ని సాహిత్యాన్ని బాగా చదివిండు.
ఇప్పుడు ప్రవీణ్ కవిత్వాన్ని అందరూ చదువుతారు..
ఇష్టంగా, స్ఫూర్తిగా.

**– అన్వర్**

# మన్నును మరఫిరంగిలా చేసిన కవిత్వం

'నెగడు' పేరుతో చింతం ప్రవీణ్ మనకు అందిస్తున్న కవితా సంపుటి ఇది. దీనిలో తెలంగాణ మట్టిబిడ్డ పడ్డ ఆవేదన ఉంది. బాధ ఉంది. పౌరుషం ఉంది. ప్రవీణ్ నాకు ఎం.ఏ మొదటి బ్యాచ్ విద్యార్థి. ఇప్పుడు నా దగ్గర పరిశోధక విద్యార్థి (పి.హెచ్.డి)గా ఉన్నాడు. ఈ విద్యార్థి మిత్రుడు వినయశీలి. స్నేహభావం అధికమే. ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సాహిత్యం మీద పరిశోధన చేయాలనుకున్నాడు గాని అది సాధ్యపడలేదు. ప్రవీణ్ కంటె ముందు కొందరు ఉద్యమ సాహిత్యాన్ని ఎంపిక చేసుకోవడంతో ఆయన ప్రత్యామ్నాయంగా మరో అంశాన్ని వెతుక్కోక తప్పలేదు. ప్రవీణ్‌లో నాకు నచ్చిన గుణం అతనిలోని పట్టుదల. ఆయన ఖాళీగా ఉన్నట్లు నాకు ఎప్పుడు అనిపించదు. గ్రూప్-2 ఇంటర్వ్యూ వరకు వెళ్ళిన ప్రవీణ్ యూ.జీ.సి. నిర్వహించే లెక్చరర్ అర్హత పరీక్ష 'నెట్' కూడా పాసయ్యాడు. అతనిలోని తపన, పట్టుదల నాకు ఎంతగానో నచ్చేవి.

ప్రవీణ్ ఏదో అలవోకగా రాసిన కవిత్వం కాదు ఇది. చక్కటి చిక్కటి కవిత్వం. ఇప్పుడు నడుస్తున్న తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదే కవిత్వం. ఎంతో ఉద్యమ స్పృహ ఉంటేనే ఇటువంటి కవిత్వం సాధ్యం. ఇతనిలో ఇంతగా ఉద్యమ ఆవేశం, తీవ్రత కనిపించడానికి కారణం తెలంగాణలోని కటువైన వాస్తవికత తప్ప మరొకటి కారణం కాదు.
కవి ప్రవీణ్ ఇలా అంటాడు-

'నా తెలంగాణలో
తల్లులు
పేగుబంధం కోసి
ఉద్యమాలను ప్రసవిస్తున్నరు...
'నాతెలంగాణాలో
యువకులు
ప్రాణాలు పోసి
పోరాటాలను బ్రతికించుకుంటున్నరు'

అని చెప్పడం కవి నిశిత దృష్టికి నిదర్శనం. తెలంగాణా ఏవిధంగా సూసైడ్ కారిడార్‌గా మారుతుందో ఈ వాక్యాలు తెలియజేస్తున్నాయి.

కారణాలు ఏవైనా ఈనాటి సాహిత్యం అంతా తెలంగాణదే. అభివృద్ధి, ప్రగతి తదితర నూతన ఆర్థిక వ్యవస్థల చిలుక పలుకులకు తెలంగాణ ప్రాంతంలోని వాస్తవికతకు పొంతన లేదు. ప్రపంచీకరణ క్రమం మొదలైన తరువాత ఈ ప్రాంతం దానికి వ్యతిరేకంగా ప్రతిఘటించే చైతన్యాన్ని కూడా ప్రోదిచేసుకుంది. ప్రవీణ్‌లాంటి యువకులు ఈ ప్రాంతంలోని శిథిలమైన బతుకులు ఇంకేం కోల్పోవడానికి సిద్ధంగా లేనప్పుడు కలాలను, కరవాలాలను పట్టి పోరాటంలోకి దిగిండ్రు. ఆ పోరాటస్ఫూర్తిని అందుకున్న కవులలో ప్రవీణ్ ఒకడు. ఇతని కవిత్వం "మానుకోట మన్నును మరఫిరంగిలా చేసి" చూపగలిగింది. ఇక్కడి పోరాట పటిమ వెన్ను చూపేది కాదు. తుపాకులకు ఎదురు నిలిచేది. సాంస్కృతిక ఆధిపత్యాలు, రాజకీయ ఆధిపత్యాలు ఏకోన్ముకంగా సాగుతున్నపుడు ఆ ఆధిపత్యాల జాడల్ని కూకటి వేళ్ళతో సహా పెకిలించి వేయాలన్న ధర్మాగ్రహం సహజంగానే కలుగుతుంది.

అడుగడుగున ఆధిపత్య సంస్కృతిని ఈ కవి కవిత్వం ఎండ గట్టింది. యువతనుద్దేశించి బలిదానాలు, ఆత్మత్యాగాలు వద్దని ధైర్యం చెపుతాడు. ఇంతగా ఈ కవి నిలువెత్తు చైతన్యగీతమై, పెనుమంటై జ్వలించడానికి తగిన మూలాలు ఇక్కడివే. స్పష్టమైన దృక్పథం, సరైన రాజకీయ చైతన్యం, తీక్షణమైన భావప్రకటన ప్రవీణ్ కవిత్వంలోంచి నెగడు రాజేస్తుంది. ఆర్థిక అసమానతలతో కూడిన ఆత్మన్యూనతా భావంతో రాజకీయ అణచివేతతో తన అస్థిత్వాన్ని కోల్పోయిన ఒక ప్రాంతపు ఆత్మాభిమాన, ఆత్మగౌరవ ఆకాంక్ష ప్రకటనే ఇతని కవిత్వం.

ప్రతికవి తన తొలి కవితా సంపుటితోనే తానేమిటో స్పష్టం చేస్తాడు. ఇతనిది రాజకీయ చైతన్య ప్రేరేపితమైన కవిత్వం. ఇది ఉద్యమ ఆవేశ కవనం. ప్రజాస్వామ్య ఆకాంక్ష దీని మౌళిక లక్షణం. ధిక్కారం ఈ కవికి అలంకారం. అందుకే ఈ నెగడు అగ్ని పర్వతమై పగులుతుంది, రగులుతుంది. ఉద్యమాల కాలంలో కవులంతా ఒకే తరహా కవిత్వం రాస్తున్నట్లు అనిపిస్తుంటుంది. కానీ ఒకే కవి పది కవితలు భిన్నవస్తువులతో రాసినా ఒకేలాగా ధ్వనించడం సహజం. కానీ ప్రవీణ్ కవిత్వం ఎంత వస్తువైవిధ్యంతో ఉన్నదో ఈ పంక్తులు గమనించవచ్చు.

'నేనొక మట్టిబిడ్డను'లో–

'నా ఇంటికి వెళ్ళాలన్నా...

దారి పొడవునా

ఇనుప కంచెలు-

కాకతీయ విశ్వవిద్యాలయ రెండు ద్వారాలను ప్రతీకగా తీసుకుని ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్న నాయకులను లక్ష్యంగా చేస్తూ...

'సమైక్య వలసవాదులను
వాళ్ళ వంతగాళ్ళను
ఫస్టు గేటు ముందర బలిచ్చి
సెకండ్ గేటు ముందర
నీ స్వేచ్ఛా పతాకాన్ని ఎగరేస్తాం'...

ఉద్యమాల ఖిల్లా ఓరుగల్లు జిల్లా నిరుద్యోగ యువత దయనీయ స్థితిని 'చెక్‌పెట్టబడినవాణ్ణి'లో

'నేనేం కోల్పోయానో
తెలుసుకునే లోపే
అన్నీ కోల్పోయాను
నేను దగాపడ్డ వరంగల్ బిడ్డను
నాలాగే నా తెలంగాణ'-

ఇవి కవి ధైర్య గీతాలు. దారుణ అన్యాయానికి గురైన తెలంగాణా బిడ్డల ఆక్రోశపు పద సంకీర్తనలు. చరిత్రను, సంస్కృతిని రాజకీయ కుట్రలను, అణచివేతను, మతాన్ని, మీడియాను దాని మాఫియా గుణాన్ని కవిత్వీకరించాడు. 'అమ్మను ప్రేమించలేని వాడు అవనిని ప్రేమించలేడు ఆకాశాన్ని జయించలేడు' అన్న ఈ కవి తెలంగాణ కవిత్వాకాశంలో అద్భుత కవిత్వ పతాకగా రెపరెపలాడుతూ ఉంటాడన్న నమ్మకాన్ని 'నెగడు'లోని కవిత్వ సెగ మనకు నిరూపిస్తుంది. కార్పొరేట్ సంస్కృతి అన్నింటిని తృణప్రాయం చేస్తుందని మనం నిరాశపడుతుంటాం గాని విధ్వంస దృశ్యంలోనూ ఒక ఆశావహ గీతాన్ని ఆలపించే వీరులు, పోరాట యోధులు పుట్టుకొస్తుంటారు. అటువంటి ఈ కవి యోధున్ని గౌరవంగా స్వాగతిద్దాం.

**డా॥ పంతంగి వెంకటేశ్వర్లు**
అసిస్టెంట్ ప్రొఫెసర్
తెలుగు విభాగం
కాకతీయ విశ్వవిద్యాలయం

# రగులుతున్న యువత

సమాజమనే పంట చేనును కవిత్వమనే వడిసెలలో మాటల గులకరాళ్ళతో నింపి వడితిప్పి విసిరి విద్రోహులను, అభివృద్ధి నిరోధకులను, ముసుగు వీరులను చీడపీడలను పారద్రోలారు అనేక మంది కవులు. అట్టి విద్రోహుల అభినవ నయవంచకుల పొడగిట్టని నికార్సయిన వ్యక్తిత్వముతో వ్రాసిన ఈ కవితలు సాటి వారికి చేతననందించే విధంగా అమరి అలరిస్తున్నాయి.

పోరాటం ఒక జీవన సత్యము. ఏ కొద్ది మందికో పూలపాన్పు. అడుగడుగున పోరాటం చెయ్యాల్సిందే! బిడ్డకు రోదన ఆయుధమయినట్లు, కవికి తన భావమే బందూకు, మాటలే తూటాలు.

ఇక్కడ బతుకు లేక పరదేశానికెళ్ళి వారి దేశాన్ని అభివృద్ధి చేస్తుంటే వారు మనల్ని సాయుధులై మట్టుబెట్టుతున్న తీరును 'అకాల మరణ ఋతువు'గా పరిగణిస్తున్నారు.

'మన దేశంలో బతుకునివ్వని ఏలికల ప్రేమకు
శవపేటికల్ని ఉచితంగా అందిస్తున్నందుకు
తలా కొంచెం సిగ్గుపడదాం..!

అంటూ కవి ఇచ్చిన పిలుపు కరుడుగట్టిన హృదయాన్నయిన కదిలించేలా ఉంది! 'హమ్ ఏక్ హై' అన్న కవితలో హిందూ ముస్లిమే కాదు మనుష్యులంతా'భాయి భాయి'అని చెప్పే భావం బహు ప్రశంసనీయం.

పల్లెలను పట్నాలు నాగరికత పేరుతో మింగేయడమే కాదు ఏ విధంగా కసాయిగా తయారైందో తెలిపే 'నగరం' కవితలోని ఈ పంక్తులు చూడండి.

నగరం
చీకటి తప్పును మోసే డస్ట్‌బిన్
గూడు చెదిరిన గుండెల ఫుట్‌పాత్
బతుకును హైజాక్ చేసే ఫ్లై ఓవర్
మానవత్వాన్ని మింగే మ్యాన్‌హోల్'–
'నగరం ఇప్పుడొక
కసాయి తనపు కవాతు జంక్షన్'–

జీవన గమ్యంలో నేనొంటరయిన వేళ, నేనో పని యంత్రమైన వేళ అమ్మ పడ్డ తిప్పలు గుర్తుకు వస్తుందన్న ఆత్మపరిశీలన మనిషిని మహోన్నతున్ని చేస్తుంది. మార్గ నిర్దేశనము చేస్తుంది. అణచబడ్డ ప్రజల, ప్రాంతాల అంతర్లీన స్వేచ్ఛా తపన ఈ కవిలో అగ్నిపర్వతంలోంచి వచ్చిన 'లావా' వలె ఈ కవితల రూపంలో బయటపడ్డది!

గ్లోబల్ మార్కెట్ చేస్తున్న ' గోల్‌మాల్' గురించి, మన వనరులు మేస్తున్న మానవ మృగాల గురించి, సెజ్‌ల రూపకంగా చెల్కలు గుంజుకొని, ఓదార్పు పేరిట చిల్లర పంచుతున్న నయా నాయకుల నైజాన్ని నిక్కచ్చిగా చెప్పాడు.

'ఎముకల మూల్గనైనా ఇడిసిపెట్టు'లో–ప్రాంతేతరుడు మనల చేస్తున్న దోపిడీని వ్యంగంగా చెప్పాడు. తెలంగాణా ప్రజల జిందగీల గురించి ఏ మాత్రం పట్టింపు లేని మీడియా, ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో 'మీడియా మాఫియా'లోని వాక్యాలు చూడండి–

'బ్రేకింగ్ న్యూస్ మీడియాది
బ్రోకెన్ లైఫ్ తెలంగాణాది'...

ఖాకీ, ఖాదీ మడతల్లో ముడతలు పడ్డ నా దేశపు జిందగీ గురించి కవి పడుతున్న వేదనను గమనిస్తే కడుపు తరుక్కుపోతుంది.

ఏ తడబాటు లేని, ఎంతో పొందికగా, స్పష్టమైన భావముతో అమరిన తెలంగాణా మాండలిక పదజాలంతో, బతుకును అద్దం పట్టిన చిత్రణతో బహు రమ్యంగా రచించిన కవికి ' పాదా పాదాన పదివేల దండాలన్నట్లు ' పదపదానికి నా సలామ్‌లందిస్తూ! ' నెగడు వెలుతురులో ' కవితల పఠనానికి మీకు స్వాగతం పలుకుతూ...

**డా॥ పి.శేషాద్రి**
జిల్లా రెవెన్యూ అధికారి మరియు
అదనపు జిల్లా మెజిస్ట్రేట్
వరంగల్

# కవితలు...


| | | |
|---|---|---|
| 1 | వీరులు | 17 |
| 2 | అమ్మ, అవని, ఆకాశం | 19 |
| 3 | నా తెలంగాణా | 22 |
| 4 | చెక్‌పెట్టబడినవాణ్ణి | 24 |
| 5 | రాబందు | 26 |
| 6 | మీడియా మాఫియా | 28 |
| 7 | వెయ్యేండ్ల చరిత్ర | 30 |
| 8 | నెగడు | 32 |
| 9 | గదే కత | 33 |
| 10 | నగరం | 34 |
| 11 | వాళ్ళు | 35 |
| 12 | అకాల మరణఋతువు | 36 |
| 13 | 'నాన్నపులి'... వచ్చె | 38 |
| 14 | డాలర్ చప్పుడు | 39 |
| 15 | తల్లీ తెలంగానం | 40 |
| 16 | మిలియన్ మార్చ్ | 41 |
| 17 | మూడో అడుగు | 42 |
| 18 | ముసుగు | 44 |
| 19 | జ్ఞాపకాలు | 45 |
| 20 | నా ఎనగర్ర | 48 |

21 ఎముకల మూల్గనైన 50
22 ఆంధ్రైజేషన్ డే 52
23 బిగ్ బ్యాంగ్ 54
24 డెమొక్రసీ 57
25 ఎరుపు - మరుపు 59
26 హమ్ ఏక్ హై 61
27 దేశ్‌కీ దడ్కన్ 63
28 ఓదార్పు 65
29 శాసనం 67
30 దస్ జిల్లోంకా దడ్కన్ 69
31 పోరు బిడ్డలు 71
32 విత్తనం 73
33 భగావో 74
34 కాకతీయ రెండు ద్వారాలు 75
35 శ్మశాన విలాపం 77
36 నేనొక మట్టి బిడ్డను 79
37 తెలంగాణా కవితా నెగడు 81
38 నేను... 84

# వీరులూ...

బరిగీసి
పోరాడితేనే తెలంగాణా

•

పోరాటమెప్పుడూ
బతకడానికీ
బతికించుకోవడానికే
చావడానికి ఏ పోరాటమూ అక్కర్లేదు

•

అమరత్వంలో 69
బలిదానాల్లో 2009
బలిదానాలతో తెలంగాణా రాదు

•

ఏండ్లకేండ్లు తినీ తినక
బట్టకట్టీ కట్టక
వెట్టిలో వెలిలో బతికిన మన జాతి

•

గడీల్లో మానప్రాణాలు కోల్పోయిన నా ఆడోళ్ళు
గడీల్లో ప్రాణాలు కోల్పోయిన నా అన్నలు
మన రేపటి ఉదయం కోసమే కదా ప్రాణాలిచ్చింది

•

శిథిలమైన బతుకు ఇంకేం కోల్పోతది?

•

దగాపడ్డ జిందగీ ఎప్పుడూ
దరి కోరుకుంటది

•

మన ఆత్మబలిదానాలతో
మారే నాయకుడెవ్వడూ?

•

మన శవాలపై రాజకీయాలు చేస్తున్న నాయకులు
కుర్చీలకై కలలు కంటున్నరు
అమరవీరుల రక్తపుకూడుకు
ఎగపడుతున్నరు

•

దాచి దాచి దొంగల పాల్జేసినట్టు
ఈ రాజకీయ గద్దలపాలు జేయడానికా...
అరవై ఏండ్ల ఉద్యమాన్ని గుండెలమీద నిలుపుకున్నది?

•

వీరులూ!
మీరు మరణిస్తే
మా గుండెలు పగిలిపోతయ్
మా పిడికిళ్ళు పట్టు కోల్పోతయ్
మా నినాదం మూగదైపోతుంది
మా కలాలు కన్నీళ్ళు పెడుతయ్
మా ఊరంతా చిన్నబోతది

# అమ్మ - అవని - ఆకాశం

అమ్మా
పేగు పంచిన నీకు
నేనేం పంచగలను
తలవంచి నీ పాదాలపై
మోకరిల్లడం తప్ప

•

ఆకాశం ఏమంత విశాలమైందీ
నీ హృదయం ముందు
అవని ఏమంత శాంతమైంది
నీ చల్లని చూపుల ముందు

•

బిడ్డా!
ఎలాగోలా బ్రతకడం కాదు
నియత్‌గ బ్రతకడం
నిందుకుండలా ఉండడం
నిలువెల్లా గాయాలౌతున్నా
నిటారుగా నిలబడమనీ
ఏ తరగతి గది నేర్పలేదమ్మా
నువ్వు తప్ప

•

రోజూ కనబడేదే కదా
అమ్మదేముంది అనుకున్నా
చెడ్డీల వయసులో

జీవన గమనంలో
ఒంటరినైన వేళ
'నా కోసం నిలబడేదెవ్వరు' అన్న ప్రశ్నకు
నువ్వే సమాధానమైనవ్

•

నేనొక పని యంత్రమైన వేళ
జీవితాంతం మాకోసం యంత్రమైన
నువ్వు యాదికొస్తవ్

•

అమ్మా! నీ కష్టం
నీ జీవితమే త్యాగం

•

ఈ నేలతల్లి నీ స్వేదంతో
ఎంతగా తడిసిపోయిందో
ఎన్ని వేల సముద్రాలు నీ కన్నీళ్ళను
దోసిళ్ళుపట్టాయో కదా

•

గ్లోబల్ ప్రపంచంలో
గడియారంలో ముళ్ళుల వెనక
పరిగెడుతున్న నాకు
పొద్దుగూకిందంటే చాలు
నీ నిరీక్షణ గుర్తొచ్చి
చిన్నబోతనమ్మా

అమ్మంటే ప్రవహిస్తున్న వాత్సల్యం
అగ్గికంటే స్వచ్ఛమైన అనురాగం
బిగించిన పిడికిలంతటి ధైర్యం
మా అమ్మే నా ప్రాణవాయువు

•

అమ్మని ప్రేమించలేని వాడు
అవనిని ప్రేమించలేడు
ఆకాశాన్ని జయించలేడు

# నా తెలంగాణా

ఆంధ్రదేశంలో
ఇప్పుడో
అటకెక్కిన తాళపత్ర గ్రంథం
నా తెలంగాణా

•

మండుతున్న నెగడులో
మాసిపోని నెత్తుటి గాయం
నా తెలంగాణా

•

మడి కట్టుక్కూర్చున్న
ఆంధ్రా నాలుకలపై
ఇప్పుడో
మైలపడ్డ పదం
నా తెలంగాణా

•

రోజు రోజుకూ
చర్చలులేని ఎన్‌కౌంటర్లు అవుతున్నా
తలదాచుకున్న మిలిటెంట్
నా తెలంగాణా

•

పోగుచేసుకున్న ఆశలన్ని
నారాయణ శ్రీచైతన్యలు
కబలిస్తూంటే
మరణశయ్యపై మౌనంగా
నా తెలంగాణా

•

మూలమైన నా చరిత్ర
మూలకుపడ్డది
ముందుతరం నా చరిత్ర
మూలం మర్సింది

•

ఇగ లేండ్రి
తెలంగాణా చరిత్రకై
కొత్త శిలాశాసనం వేద్దాం

16.10.2009

# చెక్‌పెట్టబడినవాణ్ణి

నేనేం కోల్పోయానో
తెలుసుకునే లోపే
అన్నీ కోల్పోయాను

•

ఏం చేయాల్నో
తేరుకునేలోపే
నా చేతులు కట్టివేయబడ్డయ్
నా కాళ్ళు కర్రబిగుసుకున్నయ్

•

దారులన్నీ మూసుకు పోయాక
నేనొక సెల్ఫ్ బాండెడ్ బందీని
జనగణనలో నేనొక టోకెన్ నెంబర్ని

•

నాకు గొంతుంది
మాట్లాడడానికీ ఐనా...
మాట్లాడితే
గోదారి ఒడ్డునున్న
పంటపొలాల నెర్రెలా
గుండె పగిలిపోతుంటది

•

నాకు పాటుంది
పాడటానికి
పాడితే
మూగబోయిన అజంజాహీ మిల్లులా
నా పాట కబలించబడుతుంటది

•

నేను దగాపడ్డ వరంగల్ బిడ్డను
నాలాగే నా తెలంగాణ

06.03.2011

# రాబందు

చీము నెత్తురు
ఉక్రోశం ఉద్రేకం లేని
జంతువులనెప్పుడైనా మీరు చూశారా?

•

మా తెలంగాణాలో
ఖద్దరు తొడిగి
దర్జాగా ఏ.సి కార్లలో తిరుగుతుంటరు
జనాలు మొఖం మీద ఉమ్మినా
సోయిలేని వింత జంతువులు!

•

మొగని సొమ్ము తిని
మిండెని పాటపాడే
గొప్ప నేర్పరులు!

•

రంగులు మార్చడంలో
ఊసరవెల్లికి
శిక్షణనిచ్చే మాయగాళ్ళు

•

ఎంగిలి మెతుకులకు
మూతినాకే పోటీల్లో
స్వర్ణ పతకదారులు

•

నాలుగుకోట్ల జనాల ఆకాంక్ష
నడి బజారులో నెత్తురోడుతున్నా
స్పందనలేని నపుంసకులు

●

వీరులకు కులం గోత్రం రంగు పూసి
శవాలపై ప్రమాణంచేసి
అసత్యాలే పలికే పుండాకోర్లు

●

జనాలు పట్టని జనపథ్ చుట్టూ తిరుగుతూ
బలిదానాలు ప్రేరేపించే
బట్టేబాజీలు

●

ఒరేయ్
నువ్వు ఢిల్లీకి రాజువైతేందిరా
తల్లిని తల్లగబెట్టెటోనికి
సమరు అందించేటోడివి

●

మీరు గిట్ల సంకరజాతి సంతతా ఏంది?
తెలంగాణా రక్తంలనైతే గిట్లాంటి
వంగుడు దండకాల్లేవు

# మీడియా మాఫియా

శని పెండెంట్‌ను యూజ్ చేయండి
మీ జీవితాన్ని సుఖమయం చేసుకోండి
టీవీ ఛానల్లలో కమర్షియల్ యాడ్ వల

తెలంగాణాకు పట్టిన శని గురించి
ఏ ఛానెల్ గొంతు పలకదు
•
బాక్సాఫీసు బాబుల గురించి
ఐటమ్‌సాంగ్ బేబీ గురించి
విశ్లేషకుల చర్చా గోష్ఠి
టీవీ ఛానెల్లలో

నడి బజారులో
మంటల్ని కౌగిలించుకుంటున్న
తెలంగాణా యువకుని
నిలువెత్తు ఆత్మబలిదానాన్ని
ఏ ఛానెల్ చర్చకు పెట్టదు
•

ఆంధ్రాలో శిథిలమైన శిలల గురించి
అంతరాయం లేని లైవ్ టెలికాస్ట్

తెలంగాణాలో శిథిలమైన
జిందగీల గురించి
ఒక్క ఛానల్ పెదవి కదలదు

●

ఎవరి కొంపలు ఎట్లా కూల్చాలో
సంవత్సరాల తరబడి చూపెట్టే ఛానెళ్ళు

ఏండ్ల తరబడి
మా కొంపలు కూలుస్తున్నదెవ్వరో
చూపెట్టరు

●

బ్రేకింగ్ న్యూస్ మీడియాది
బ్రోకెన్ లైఫ్ తెలంగాణాది

18.05.2011

# వెయ్యేండ్ల చరిత్ర

నాన్- లోకల్ నన్నయ్యను
మా మెదళ్ళలో
ఏళ్ళతరబడి నింపిన మీరు
నా తెలుగన్న గురించి
ఏ తరగతిలో చెప్పలేదేం?

•

పుస్తకాల పేజీల నిండా
మార్కుల మాయాజాలంతో
కే.జీ నుండి పీ.జీ దాకా
మాది కాని భాషను
ఇంజెక్ట్ చేసిండ్లిన్నాళ్ళు

•

తండ్లాట బతుకు
తెలంగాణా ప్రజలదైతే
భామ కవిత్వపు పాకులాటలు
మీ భావ కవులది

•

తెలంగాణా బిడ్డలు
గుండెలవిసేలా రోదిస్తుంటే
కనికరం లేని మీ కలం
కవిత్వానికి నేర్పిందో కులం

•

నన్నయ్య
నరేంద్రుని బొందలో నిద్రపోతే మాకేం!
నిద్రనీల్గితే మాకేం!?

•

తెలంగాణా అనంగనే
తెలుగు లెస్స అంటరు
చంపిన చేతులతోనే దండలేసి
శ్రీరాముల భజనలు జేస్తరు

•

మా గోడు పట్టని
మీ సాహిత్యానికి
జీవితకాలపు
ఉద్వాసన పలుకుతున్నాం

•

ఇగ
మా చరిత్రను మేమే రాసుకుంటం
మా చరిత్రను మేమే సదువుకుంటం
ఏండ్లకేండ్లు అంటరానిదైన మా చరిత్ర
మీరు అగాధాల అడుగుల తొక్కిపెట్టిన
వెయ్యేండ్ల చరిత్ర

06.09.2011

# నెగడు

నా తెలంగాణలో
సూరీడు
నెత్తురై మండుతున్న
వీరుడు

•

నా తెలంగాణలో
భూమి
ఎర్రెర్రని గాలిని
గుండెలనిండా నింపుకుంటది

•

నా తెలంగాణలో
రైతన్నలు
చెమటను ధారపోసి
ఆత్మహత్యల్ని పండిస్తుంటరు

•

నా తెలంగాణలో
తల్లులు
పేగుబంధం కోసి
ఉద్యమాలను ప్రసవిస్తున్నరు

•

నా తెలంగాణాలో
యువకులు
ప్రాణాలు పోసి
పోరాటాలను బ్రతికించుకుంటున్నరు

# గదే కత

తాతయ్యే నయం
కనీసం చప్రాసీ అయ్యిండు
నాన్నా! ఇంత చదివి నువ్వేం చేస్తున్నవ్

నా కొడుకు ప్రశ్న?

●

ఒక్క కుదుపు కుదిపినట్లు
సుడులు సుడులుగా చరిత్ర

●

నువ్వు చప్రాసీ కాకుండా
సుబ్బారావ్ అంకుల్ లాగా
ఆఫీసర్ అయ్యుంటే..?

గప్పట్ల నాన్ననడిగిన

●

నాన్న దు:ఖసాగరమయ్యిండు
వలస కొంగలు
వల విసిరి చేస్తున్న ద్రోహాన్ని తలచి

●

తరాలు మారినా తలరాత మారని బతుకు
బరిగీసి పోరాడుతున్నా బందీగానే తెలంగాణా

10.06.2010

# నగరం

నగరం
ప్రవహించే డాలర్ల సముద్రం
నిశానిచ్చే కొకైన్ కబంధహస్తం
కాక్‌టైల్ కరాళ నృత్యం
అందాల అమ్మకపు చిత్రం

•

నగరం
కాపిటలిస్ట్ చేతిలో కార్మికుని స్వేదం
అన్నార్తుల చేతిలో ఆకలి పల్లెం
అన్ ఎంప్లాయ్ చేతిలో పాయిజన్ మాత్ర
ఉన్మాది చేతిలో ఆసిడ్ పాత్ర

•

నగరం
చీకటి తప్పును మోసే డస్ట్‌బిన్
గూడు చెదిరిన గుండెల ఫుట్‌పాత్
బతుకును హైజాక్ చేసే ఫ్లై ఓవర్
మానవత్వాన్ని మింగే మ్యాన్‌హోల్

•

నగరం ఇప్పుడొక
కసాయితనపు కవాతు జంక్షన్

27. 10. 2008

## వాళ్ళు...

తెలంగాణా మట్టిచెర
విడిపించటానికి
పిడికిళ్ళెత్తిన
నెత్తుటి త్యాగాలు
69' లో 369
2009 నుండి 700లకు పైగా...
•
మరి...
పదవీ త్యాగం
చేసినవాళ్ళు ?

09.12.2011

# అకాల మరణఋతువు

సరిహద్దులు దాటిన ప్రాణానికి
ఇక ఏ గ్యారంటీ లేదు
•
అకాల మరణాల వసంతంలో
ఆయువొక సుడిగాలి దీపం
•
వీసాలు పాస్‌పోర్ట్‌లు
నిస్సిగ్గుగా...
ప్రాణాలను ప్రమోట్ చేస్తున్నాయి
•
డాలర్లు పాడే థండర్ మ్యూజిక్‌లో
వలసబోయిన జిందగీలన్నీ
పచ్చినెత్తురు ముద్దలవుతున్నాయి
•
నాలుగురాళ్ళ కోసం ఖండాలు దాటితే
పగబట్టిన పరదేశి
సాయుధమై పలకరిస్తున్నడు
•
అక్కడ గ్రేవ్‌యార్డులో ఆర్కెస్ట్రా సంగీతం
ఇక్కడ నా తల్లుల గుండెల్లో మరణమృదంగం
•
మనుషులను ఎక్స్‌పోర్ట్ చేస్తూ
చావులను ఇంపోర్ట్ చేసుకుంటున్న
నా దేశమా నీకో సలామ్!
•

బతుకునివ్వని ఏలికల ప్రేమ
శవపేటికల్ని ఉచితంగా అందిస్తున్నందుకు
తలా కొంచెం సిగ్గుపడదాం!

•

చిగురించే ఆశలకి ఆలోచనలకి
చరమగీతం పాడిన చేతులు
అబ్రాడ్‌లో
మరణశయ్యలను సిద్ధం చేస్తున్నాయి

•

బతకడానికి లేకున్నా
చావడానికైనా ఇక్కడ ఫ్రీడం వుంది

•

భూ బకాసురులు ఎంత మేసినా
అక్కున చేర్చుకోడానికిక్కడ
ఇంకా కొన్ని శ్మశానాలు మిగిలే ఉన్నయ్

•

చావడానికైతే
అమెరికా అరబ్బు ఆస్ట్రేలియాలకెందుకు?
ఇక్కడే బతుకుదెరువు మేత కోసం
అటో ఇటో తేల్చుకుందాం రండి

(పరాయి దేశాల్లో ప్రాణాలను కోల్పోయిన దోస్తులను
యాది చేసుకొని.....) ప్రజాకళ మార్చ్, 2010 సంచిక

# ‘నాన్నపులి’... వచ్చె

బాల్యం అందరికి మధురానుభూతి
నాది మాత్రం భయాందోళనల స్థితి

●

నా మస్తిష్కంలో నీ ఊహలు కదలాడగానే
బండబూతులు
చీదరింపులు
అవమానం
ఆందోళన
నిశ్చలంగా ఉన్న నన్ను
ఒక్క కుదుపు కుదిపేస్తవ్ కదా నాన్న

●

నా తలనిమిరి సుతారంగా
ఎపుడైనా ముద్దాడావా?

●

నువ్వెప్పుడైతే
నీకన్న మిన్నగా
నీలోని సైతాన్ను ప్రేమించటం మొదలు పెట్టావో
అపుడే ద్వేషించడాన్ని
ప్రేమించడంగా మార్చుకున్నవ్

●

చేను మేసిన కంచెను
నిలదీసి అడిగేదెవరు?

●

పుట్టకకు కారణమయ్యే నాన్నే
చావుకి కూడా కారణమేనా..?

•

నాన్నలు బతకాలంటే
కొడుకులు బతకాలి!

'నాయిన ' సంకలనం – 2006

# 'డాలర్' చప్పుడు

క్యాపిటల్ మార్కెట్‌లో
ఏ వస్తువైనా విలువైనదే!
మనిషి తప్ప

•

బతకడమనేది ప్రారంభిస్తే
జీవితం అంతమౌతుంది

•

జీవం ఉండి కదలిక లేని నిన్ను
వ్యవస్థ గాఢంగా ప్రేమిస్తుంది

•

కేవలం
పన్నుకట్టడం కోసమే
బతకడమనేది
ఎంత నిస్వార్థమైన జీవితం

•

అన్వేషించకు-
సమాధానం ఆశించకు-
రాజ్యం చూపులు నీపై వాలవు గాక వాలవు

-2006

# తల్లీ తెలంగానం

ఉద్యమం
ఎన్ని సార్లు
తల్లి పాదాల ముందు
త్యాగాలను కుప్పగా పోసిందో
తెలంగాణా స్వేచ్ఛ కోసం

•

బిడ్డల ఉద్యమం చూసి
నిస్సహాయంగా
వలవలా ఏడుస్తోంది
తెలంగాణా తల్లీ

•

విషాదాలను మోస్కుంట
బరువెక్కిన గుండెతో
త్యాగాలను తలపోసుకుంటూ...

# మిలియన్ మార్చ్

నేను తల్లి గర్భంలోంచి
ఈ నేలలోకి
విసిరి వేయబడ్డ
అస్థిత్వపు రక్తమాంసాన్ని
•
నాతో పాటే
నా నేల
నా కలం
నా కులం...
•
నా చరిత్రను
నేనెప్పుడూ భుజంపై
మోసుకు తిరుగుతున్నా
పాటనై
ఆటనై
మాటనై
•
నా జన పదాన్ని
ఓ చోట నిలుపుదామంటే
నా ఊర్లనే నాకు చోటు లేదు
మా పునాదుల మీద
మీ భవంతులే!
•

మా అయ్య
అయ్యకు అయ్య...
మీ అణచివేతను ఆక్రమణని
ఏండ్లకేండ్లు భరించిండ్లు

●

కానీ
మా పోరగాండ్లు
పోరాటాన్నే వారసత్వంగా తీసుకున్నోళ్ళు
అణచివేతపై అగ్గై మండెటోళ్ళు
నడుం బిగించిండ్లు

●

మా జాతి చరిత్ర తెల్వనోళ్ళు
మా దక్కన్ గుండెలను చీల్చి దర్జాగా
నగరం నడిబొడ్డున
శిలలై శిల్పాలై నిలుచుడేందని
గడ్డపారలందుకున్నరు

●

భూమిని చీల్చుకుని
విత్తనం మొలకెత్తుతున్నది

'మిలియన్ మార్చ్' సందర్భంగా...

# మూడో అడుగు

వామనుని తొలి అడుగు
1956, ఫిబ్రవరి 20
పెద్ద మనుష్యుల ఒప్పందం

1956 నవంబర్ ఒకటి
తెలంగాణా బలిదినం
విశాలాంధ్రాలో తెలంగాణా ఖననం
వామనుని తొలి లక్ష్యం నెరవేరింది
•
తెలంగాణా తొలి దశ ఉద్యమం
వామనుని రెండో అడుగు
ఉద్యమ అణచి వేత
నాన్‌ముల్కీల స్థిరీకరణ

తెలంగాణా జాతి ఆత్మాభిమానం బలి
వామనుని రెండో లక్ష్యం నెరవేరింది
•
తెలంగాణా మలి దశ ఉద్యమం
వామనుని మూడో అడుగు...

మనం బలి చక్రవర్తి వారసులమే
బలి కావడానికి వారసులం కాదు
మళ్ళొకసారి బలికావద్దు బిడ్డా!
వాని మూడో అడుగు పడనీయొద్దు
'శ్రీకృష్ణ కమిటీ'ని నిరసిస్తూ-

# ముసుగు

కరెన్సీ నోటు కక్కుర్తికి
సూర్యోదయమాపగలరు

•

అరుణోదయ ప్రవాహాన్ని
వేలానికి పెట్టగలరు

•

ముసుగు బయట శాంతి పాట
కుట్రనేది లోని మాట

•

ఖాకీ ఖాదీ చొక్కా మడతల్లో
ముడుతలు పడ్డ జిందగీ
నా దేశం!

24. 04. 2006

# జ్ఞాపకాలు

ఆకురాల్చిన చెట్లు
మళ్ళీ చిగురించినట్లు
మనం నడుస్తూ నడుస్తూ
జ్ఞాపకాలను మోస్తుంటాం

●

జ్ఞాపకాలెప్పుడూ
గుండెలోతులో తడిని స్పర్శిస్తాయ్

●

కొన్ని జ్ఞాపకాలు
గొంతు తడారేలా...
కొన్ని మాత్రం వెచ్చని కౌగిలిగా...

●

హృదయం మూగబోయినప్పుడు
కండ్లు కన్నీళ్ళ జలపాతమైనప్పుడు
నిట్టూర్పుగా ఒంటరైన వేళ
ఆత్మీయ ఆలంబనలు- జ్ఞాపకాలు

●

గ్లోబల్ కబంధ హస్తాల్లో
గూడు చెదిరిన పక్షుల్లా
చెట్టుకొకరం పుట్టకొకరమైనప్పుడు
సహచరులు- జ్ఞాపకాలు

●

ఆవేదనలు ఆర్థికస్పర్శతో
తొలగిపోయే దినాలు
మనిషిని అనామకుడిని చేస్తున్నాయి

•

భౌతికంగా చుట్టూ అందరూ
భారంగా నిష్క్రమిస్తుంటారు
మానసికంగా ఒక్కడిని చేస్తూ...

•

ఆర్టిఫిషియల్ నవ్వులు
ఏమాత్రం భరోసా కలిగించలేక
తుళ్ళిపడి నవ్విన రోజుల దృశ్యాలు
ఆనంద భాష్పాల్లాగా మారుతూ...

•

చుట్టూరా అల్లుకున్న బంధాలన్నీ,
దిక్కులు మార్చుకుంటుంటే
గత్యంతరం లేక
ఓ దిక్కుకు లాక్కెళ్ళబడతాం
అనాలోచితంగా
అయిష్టంగా

•

శిథిలమౌతున్న జ్ఞాపకాల్లో
కొన్నింటిని వెంట పెట్టుకుంటాం
ఎక్కడ చేజారిపోతాయేమోనని
భయంగా బాధగా ఆర్ద్రంగా

22.09.2009

# నా ఎనగర్ర

జీవించడమంటే
రోజులు ఎల్లదీసుడు కాదని
నీకు తెలుసు

•

జీవించడమంటే
దినసరి వాయిదాల చొప్పున
సచ్చిపోయే బతుకనీ నీకు తెలుసు

•

నువ్వెప్పుడూ
వర్తమానంలో నిలిచి
భవిష్యత్తును కలగనలేదు
బతుకులో నిలబడి
జీవితంలోకి అడుగులేసావు

•

మద్యంరక్కసి ధాటికి
బంధాలన్నీ దింపుడుకళ్ళంలో
పేగుతెంపుకొని పోతుంటే
నువ్వెప్పుడూ కాష్టాన్ని
నిందించలేదు

•

ఒక్కొక్క వాసమే
కూలిపోతుంటే
ఎనగర్రలా నువ్వు...

•

జీవితపు రహస్యాన్ని
పిడికిట పట్టిన శాంతవ్వా
నీ పేరులో ఉన్న శాంతి
నీ బతుకులో లేదెందుకే!

" నాయనమ్మ యాదిలో"
07.09.2010

# ఎముకల మూల్గనైన ఇడ్సిపెట్టు

కట్లే... అంటే
కుక్కసోంటిది
వచ్చిన దారిన వెళ్ళిపోతది
పౌరుషంగా మొఖం తిప్పి చూడకుండ

•

చత్ నీ అవ్వా!
నీ జాగల నువ్వుండు
ఎందుకట్ల మీద మీద పడ్తవ్

•

చింతామణీ
నువ్వెన్ని దినాలున్నా
మన తనువులు కలుస్తాయేమో !
మనసులు మాత్రం కలవయ్!!

•

తమిళ తంబిల దగ్గర
ఇడుపు కాయితం తీస్కోని
ఇన్నేళ్ళు నా మీద పడ్డవ్
'నాజూకు బీబీ నౌ రోటీ' తిన్నట్లు
ఉన్నదంతా ఊడ్చుక తిన్నవ్

•

నా చింతకు కారణమైన ఓ! చింతామణీ
నా చితికి కారణమైనవ్
ఆకలి కడుపుల అయ్యవ్వలు
ఎముకలగూడసోంటి మమ్మల్ని కన్నరు
నా ఎముకల మూల్గనైనా ఇడ్సిపెట్టు

•

నీతో సోపతి ఇగ సాలు
మీ ఊరికే బొయ్యి
రికార్డింగ్ ట్రూప్ పెట్టుకో
పో...

01.11.2010

# ఆంధ్రైజేషన్ డే

మా మస్తిష్కం ఆమోదించని పదం
నవంబర్ ఫస్టు
ఎవరి కోసం?

•

ఆంధ్ర కమ్యూనిస్టుల పాచిక పారింది
విశాలాంధ్రలో తెలంగాణ ఖననం

•

మా చెమటని రక్తాన్ని
విరామం లేకుండా దోచుకున్న
పెద్ద మనుషుల ఒప్పందమే నవంబర్ ఫస్టు

•

భాష సంస్కృతి పైన
నీళ్ళు నిధులు నియామకాల పైన
అరవై ఏండ్లుగా ద్రోహం జరగని రోజు లేదు

•

విద్రోహం ప్రతిరోజు
మేం ఉద్యమాన్ని పిడికిలెత్తాం

•

మా గాయాలు సలుపుతూనే ఉన్నయ్
నీవెన్నడు గుర్తించని గాయాలు

•

నెత్తురై మండుతున్న దేహాలు
పోరుబాటలో సబ్బండ కులాలు

•

ఓరి ఆంధ్రోడా!
తమిళ తంబిలు
మిమ్మల్నెందుకు
తన్ని తరిమింద్రో జెర జెప్పుంద్రి?

'సూర్యుడు ఉదయిస్తాడు' కవితా సంకలనం,
'*నమస్తే తెలంగాణ*' 01.11.2011

# బిగ్ బ్యాంగ్

ఒక్క సారి చరిత్రను యాజ్జేసుకుందాం

మా నెత్తురును
ముడి సరుకుగా
యంత్ర భూతాలకు ఎరవేసి
మీ తరతరాలకు తరగని ఆస్తిని
పోగేసుకున్నరు

•

మా వృత్తులకు
ఉరితాళ్ళు పేనీ
ఏండ్లకేండ్లు వెట్టి చేయించి
టన్నుల కొద్ది శ్రమదోపిడి చేసిండ్లు

•

మా చెమటని ఎరువుగా మార్చి
మీ పంటపొలాల్లో పారించి
పచ్చని నోట్లను పండించుకున్నరు

•

మా కన్నీటిని
ఆవిరి చేసి
మీ వెకిలి నవ్వుల్తో హింసించి
పైశాచికానందం పొందిండ్లు

•

ఐనా
మీ ఇళ్ళకి దర్వాజాలైనోళ్ళం
మీ పంటలకి కంచెలైనోళ్ళం
మీ విందులకు కంచాలైనోళ్ళం
మీ కుట్రలకు సమాధులైనోళ్ళం

●

ఏండ్లకేండ్లు మా రక్తపుకూడు తిని
మా చెమటను తాగిండ్లు
గిప్పుడు
సామాజికం అనంగనే
సగం సచ్చిపోతున్నవేంది దొరా

●

మీకు బానిసలుగానే ఉంటమని
మాతో కలిపి
మా భావితరాలను
బాండ్ పేపర్ రాసిమ్మంటారా?

●

మాకు స్వేచ్ఛా రాజ్యాధికారం కావాలంటే
నీ రాజరికం పోతదని రంది తగిలిందా?

●

బాంచెన్ అన్న బక్కోళ్ళమే
మా ఎరుక మేం చేసుకుంటున్నం.
మీ గురించి కూడా తెలుసుకుంటున్నం

●

ఏం బుగులైతున్నదా?
ఔను మల్లా!
నోటికి ముంత
ముడ్డికి తాటాకు సిద్ధాంతం
మీ మీద అమలు చేసే అద్భుతకాలం
ఇప్పుడే కళ్ళు తెరుస్తోంది

08.01.2010

# డెమోక్రసీ

జనాల రక్తాన్ని పీల్చి పీల్చి
బొజ్జ పెంచిన
నా దేశపు ప్రజాస్వామ్యానికి
పేదోడు ఒక ప్రయోగశాల

•

బీదల రక్తమాంసాలను
వేలం వేస్తుంటే
చట్టాలెప్పుడూ
ఉన్నోడి
ఉంపుడుగత్తెలు

•

ఉగ్రవాదులను
ఉరి తీయడానికి
ఉచ్చపోసుకు సచ్చే
ఈ దేశ ప్రజాస్వామ్యం
పట్టెడన్నం పెట్టే అమాయక రైతన్నని
విత్తనాలడిగితే వీధుల్లో
ఎన్‌కౌంటర్ చేయిస్తది

•

ఓటుందో ఊడిందో తెలియని
ఓటర్లున్న ఈ దేశంలో
పౌరహక్కులు నిత్యం
అత్యాచారానికి గురౌతుంటాయ్

•

ఓ నా ఇండియన్ డెమోక్రసీ!
నువ్వు కార్పోరేట్ బిడ్డను మోసే సరోగసివి
ప్రశ్నించడాన్ని అణచిపెట్టే తండ్రివి
నిస్సహాయులకు ఏమీ పంచలేని
ఓ దీనురాలివి

30.08.2008

# ఎరుపు - మరుపు

ఎత్తైత్తు భవనాలపై
ఎర్రెర్రని జెండా
నేలపై నీడలా వాలడానికి సైతం
ఇష్టపడడం లేదెందుకు?

●

భాషా ప్రయుక్త రాష్ట్రాల
ప్లకార్డ్ ప్రదర్శించి
అమెరికా సామ్రాజ్యవాదపు
నినాదం మార్మోగించి
కార్మిక కర్షకుల గురించి
మాటల్లో తూటాలు పేల్చే
ఓ నా కమ్యూనిస్టు...

●

తెలంగాణాలో ఉన్న
ఆంధ్రా సామ్రాజ్యవాదం గురించి
నోరిప్పడం లేదెందుకు?

●

వర్గదోపిడి గురించి
వారం వారం శిక్షణా తరగతుల్లో
ఊదరగొట్టే కామ్రేడ్
వందల ఏళ్ళనాటి తెలంగాణా గోసను
ఎప్పుడూ చెప్పలేదెందుకు?

●

తెలంగాణా చిందిస్తున్న నెత్తురు
చూస్తూ కూడా
ఎందుకు మడికట్టుక్కూర్చున్నవ్
తెలంగాణ ప్రజలది రక్తమే కాదా?

●

తెలంగాణా అనంగనే
'తెలంగాణా సాయుధ పోరాటం'
పాత డ్రామా ప్లే చేసే నా అన్న
ప్రజల కోసం పార్టీయా ?
పార్టీ కోసం ప్రజలా?

●

విశాలాంధ్ర విషపు కౌగిలి ఫలితం
తెలంగాణాలో ఆంధ్రారాజ్యం

●

ఎత్తెత్తు భవనాలపై
ఎర్రెర్రని జెండా
నేలపై నీడలా వాలడానికి సైతం
ఇష్టపడడం లేదెందుకు?

# హమ్ ఏక్ హై

ముంబై కిరాతకం
మక్కా మారణ హోమం
లుంబిని విధ్వంసం
కోఠీ నరమేధం
పేర్లు ప్రదేశాలే వేరు
అన్నీ ఉగ్రవాదపు దాష్టికత్వానికి
సాక్షీభూతాలు

•

అమాయకుల ఆర్తనాదాలు
అల్లకల్లోలపు హాహాకారాలు
పిచ్చెక్కిన మీ మతపు ప్రార్థనా గీతాలా?

•

ఏ రంగు
ఏ మతం మీది
ఏ దేవుడు
మీ నీచత్వానికి క్షుద్రత్వానికి ఆరాధ్యుడు
మనుషుల్ని మట్టుపెట్టమని
మీ ఏ పవిత్ర గ్రంథం చెప్పింది

•

మతం ముసుగులో ఉగ్రవాదం
హిందూ ఐనా ఇస్లాం ఐనా
జరుగుతున్నది వినాశనమే

హిందూ ముస్లిమే కాదు
మనుష్యులంతా భాయి భాయి

•

మాలోని ఐక్యతను
అణుబాంబులైనా
అణుమాత్రం విడదీయ లేవు

•

అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా
చరిత్ర అడిగే ఒకే ఒక్క ప్రశ్న
మీరెప్పుడైనా
మనుష్యులు లేని మతాన్ని చూశారా? అని

హైదరాబాద్ బాంబుపేలుళ్ళకు నిరసనగా
25.08.2007

# దేశ్ కీ దడ్కన్

ఈ దేశపు గుండెకు
జబ్బు చేసింది

•

ఈ దేశపు కాలేయం
వాపుకు గురౌతుంది

•

ఈ దేశపు కిడ్నీలు
పంపింగ్ చేయడానికి
మొరాయిస్తున్నాయ్

•

ఈ దేశపు స్పైనల్‌కార్డ్
వంకర్లు పోతుంది

•

మీడియా అసత్యాల హోరులో
అర్ధనగ్న ప్రదర్శనల జోరులో
అస్త్రసన్యాసం చేస్తున్న యువత

•

రింగులు రింగులుగా
ధూమపానం సేవిస్తూ
దునియాను జయించినట్లు కలగంటున్నరు
భావి జీవితమంతా
విషవలయమౌతుందని తెలుసుకోలేక

•

ఎగువ
దిగువ సభల్లోని
ముసలి నక్కలు
నీ యవ్వనాన్ని
ఎగుడు దిగుడుగా మార్చేస్తున్నయ్
నీ తలసరి ఆదాయం తెల్వని రాజ్యం
నెలవారీ ఆల్కహాల్ కోటాను నిర్ణయించి
రోజువారీ వాయిదాల్లో చంపుతున్నది

●

ఆనందమొచ్చినా ఆవేదనొచ్చినా
అత్యవసరంగా మత్తులో ముంచేసి
గడ్డీ స్కూల్ పిల్లాడి చెడ్డీ
స్కాముల మీద స్కాములు...

●

నువ్విప్పుడు
అస్తి పంజరానికి
అంగీ వేసిన మాట్లాడే బొమ్మవి

●

నువ్వు మనిషివే ఐనా
నీ శరీరం
నీ మనస్సంతా
రిమోటింగ్ చేయబడ్తున్నాయ్

●

నువ్వీ దేశపు గుండెవురా
నువ్విప్పుడే నిర్వీర్యమైపోతే
నా సోదరా...
ముందున్న మహా యుద్ధం
గెలిచేదెలా!?

08.02.2009

# ఓదార్పు

జనాలందరిని
పావురాలగుట్ట పాచికలు చేసి
కుర్చీ కలగంటున్నాడొక విషపుత్రుడు

●

నవ్వుతూ తండ్రి చంపితే
కొడుకు ఏడ్చి చంపుతున్నాడు

●

చర్చలపేరుతో దండకారణ్యాన్ని
సెజ్ వల విసిరి తెలంగాణా భూముల్ని
అన్నింటికన్నీ చెరబట్టిన భూకామాందు
పోతూ పోతూ నల్లమలలో
నాల్గెకరాలు కబలించిండు
తన భూదాహం తీరలేదన్నట్లు

●

నీ అయ్య పాలనలో
నడిబజారులో నా తెలంగాణా
సర్వం కోల్పోయింది
ఆత్మాభిమానం తప్ప

●

నియంత కడుపున
నియంతే పుడుతడు

●

తండ్రి ఎన్నికల్లో వీసా విషపు మాటైతే
తనయుడు పార్లమెంట్‌లో ప్లకార్డ్ పాటైండు
తండ్రి తంతెల మీద
కొడుకు కోనేట్ల....

●

మా గాయాలు సలుపుతూనే ఉన్నయ్
ఒక్కో పిడికిలి మానుకోటై
మండుతున్న నెత్తుటిపాటై
శివాలెత్తుతయ్

●

మన్ను, మిన్నూ
రాయి, రప్ప రెక్కలు తొడుక్కుంటయ్
నీ రాకను పసిగట్టి

●

ఒరేయ్! సమైక్య 'జలగ'న్
శవం కంపు తలా ఇంత పూయకు
గో బ్యాక్ టు ఇడుపుల'మాయ'

28.05.2011

# శాసనం

పోటుకు పోటు
వేటుకు వేటు
పిశాచిపట్టిన మనుషుల్లారా!
నరుక్కు చావండి

•

కులాల కోసం
పొలాల కోసం
కుమ్ములాడుతూ
కొట్టుకు చావండి

•

కసాయితనం
నశాలమెక్కి
కత్తులు పట్టి
కవాతు చేయండి

•

హింసను మొక్కి
అహింసను తొక్కి
పాతాళంలో పాతరేయండి

•

రక్తపు మడుగుల
రణరంగంలో
రాజ్యపు చరిత్ర
రాసి చూపండి

●

ప్రత్యర్థుల నెత్తురు
పాడవకుండా
మీ చెల్కల్లో
చెలిమెలు తీయండి

●

భావి భారతం సిగ్గుపడేలా
శవాల చరిత్ర
శాసనమేయండి

*ఫ్యాక్షనిజానికి బలవుతున్న సీమాంధ్ర సామాన్య ప్రజానీకానికి అంకితం* –2007

# దస్ జిల్లోంకా దడ్కన్

ట్యాంక్‌బండ్ మీద నిలబడి
సరిగ్గా బుద్ధున్ని చూడండి
దగ్గరికెళ్ళి పాదాలను తాకండి

•

ఊతమిచ్చిన తాడిని తలదన్నిన మద్రిలాగ
ఊపిరిచ్చిన నేల ఉసురు తీస్తున్నరు

•

అడుగిచ్చిన మట్టిని
అగాధంలోకి నెట్టే ప్రయత్నం చేసినందుకు
ఈ మట్టిని క్షమాపణ కోరండి

•

మిమ్మల్ని కరుణించిన ఈ మట్టిని
కబలిస్తున్నందుకు సిగ్గుపడండి

•

అభివృద్ధిభజన చేసే ముందు
బంజారా భవనాలొదిలి బయటకు రండి
ఓసారి భోలక్‌పూర్ నీళ్ళు తాగి
ఓరోజు రసూల్‌పురాలో గడపండి

•

కలిసి బ్రతుకుతున్నామన్న మాటే గాని
ఎవరినుంచి ఎవరెంత తీసుకున్నాం

•

ముఖాలకు రంగు రంగులేసుకున్న మీరు
పునాదులిచ్చిన నగరం కాదు భాగ్యనగరం

•

పది జిల్లాల రక్తశుద్ధి కేంద్రం
పది జిల్లాల పేగుబంధం
హైదరాబాద్‌ది ఎప్పుడూ తల్లి ప్రేమే
దక్కన్ దస్ జిల్లోంకా దడ్కన్

# పోరుబిడ్డలు

రోజుకో బిచ్చగాడు
పూటకో పార్టీ పెట్టి
జెండాల నీడన
రహస్య అజెండాలు రచిస్తున్నరు
●
ముడ్డీ కింద కుర్చీ ఉన్నప్పుడు
మూతి తెరవనోడు
పదవి మత్తు వదలంగనే
రంగు రంగుల జెండాలతో
'జై తెలంగాణా' అంటంఁడ్రు
●
ఉద్యమం ఉవ్వెత్తిన ప్రతీసారి...
ప్రతీసారి ఢిల్లీ విమాన సర్వీసులు పెరుగుతయ్
తెలుగు వారి ఆత్మగౌరవం దెబ్బతింటది?
దేశంలో అవినీతి పెరిగిపోతది?
చచ్చుబడ్డ సి.బి.ఐకి రెక్కలొస్తయ్?
అన్నల సంఖ్య అమాంతం పెరుగుతది?
●
ఇగ
ఈ నాటకాలన్ని బంజేయుండ్రి
'తెలంగాణా చంటిబిడ్డ
యవ్వనానికొచ్చింది'
●

తెలంగాణా
ఎవ్వడికో ఒక్కడికి
గుత్తకిచ్చిన ఉద్యమం కాదు

•

అప్పుడు
ఇప్పుడు
ఎప్పుడూ
తెలంగాణా ఉద్యమ వారధులు
పోరు బిడ్డలే-

# విత్తనం

మేము
బుక్కెడు బువ్వకోసం
మా బతుకును తాకట్టు పెడితే
మీరు అధికారం కోసం
మా జీవితాలనే తాకట్టు పెడ్తరు

•

ప్రజాస్వామ్య పోటీలో
వాగ్దానాల వర్షం కురిపిస్తరు
అప్పటికీ
మేం తడవక పోతే
మా జేబుల గింత చిల్లరపెట్టి
మా కడుపుకింత సారాపోసి
మమ్మల్ని ఏక్ దిన్‌కా బాద్‌షా చేస్తరు

తెల్లారి నుండే
హర్ ఏక్ మాల్! అంటూ
మా సమూహాన్ని అంగట్లో పెడతరు!

•

చెట్టును తిడుతూ కూర్చుంటే లాభంలేదు
ముందు
విత్తనపు గుణాన్ని బేరీజు వెయ్

•

నమ్మడమే మొదటి తప్పు
మోసపోయామనడం మరో తప్పు

–2006

# భగావో

గీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ ట్రూపోల్ల కోసం
మనం సచ్చుడేంది బిడ్డా!
గీసారి మనం కాలుడు గాదు
వాళ్ళనే కాలబెట్టాలె
ఊరొదిలి పోయే దాకా
క్విట్ తెలంగాణే!

•

అండ్ల తంతే భద్రాచలం పాత మాట
ఈసారి ఈడ్సి తంతే
ఇశాఖపట్నంల ఇడ్లే దిక్కు

•

మెత్తని మాటలతో చెప్పుడైపోయింది
ఓపిక నశించింది
ఇగ లేన్రి
లగాంచి ఒక్క లాత్ కొట్టన్రి

•

మన దెబ్బకు వాడు ఆగమాగం కావాలె
పంచెల రెండుకు పోవాలె

•

యాభైనాలుగేండ్ల సంది
ఇగ్గపట్టుకున్న ఆవేశాన్ని
ఉచ్చ పోసినట్టు
తలా కొంచెం చిమ్మిచ్చిపోద్దాం!!

*'క్విట్ తెలంగాణా' (సింగిడి)*

# కాకతీయ రెండు ద్వారాలు

కరుడుగట్టిన సమైక్యాంధ్ర కుట్రలో
కమిటీల కాలనాగులు
కాలయాపన కాట్లు వేస్తూంటే

వందలాది బిడ్డలను కోల్పోతున్న
నా తెలంగాణా ఇంకెన్నాళ్ళు
నీకి కడుపు కోత?

●

ఉన్నత చదువుల కోసం
ఊరొదిలిన బిడ్డలు
ఉస్మానియాలో శవాలై తేలుతుంటే...

●

రెండు కండ్ల ఆంధ్రబాబు
రెండు కాళ్ళ జగన్
రెండు నాల్కల కాంగ్రెస్సు
కపట సిద్ధాంతాలు వల్లిస్తున్నరు

●

అమ్మా! ఇక ఏడవకమ్మా
సమ్మక్క సారలమ్మ
పోరుగల్లు చరిత్ర మాది
మానుకోట మన్నుని
మర ఫిరంగిలా చేసిన సాహసం మాది
నిర్భందానికి వెన్ను చూపని
రాయినిగూడెం రౌద్రం మాది

కాకతీయ విశ్వవిద్యాలయం
సాక్షిగా చెబుతున్నాం

•

ఇక సిద్ధాంతాలు లేవు
మీ కబోది కండ్లను
మీ కదలిక లేని కాళ్ళను
మీ జూటా నాల్కలను చీరి
ఒక్కో గేటు ముందర పాతర పెడతం

•

సమైక్య వలసవాదులను
వాళ్ళ వంతగాళ్ళను
ఫస్టు గేటు ముందర బలిచ్చి
సెకండ్ గేటు ముందర
నీ స్వేచ్ఛా పతాకాన్ని ఎగరేస్తాం

*రాయినిగూడెం మహిళల పోరు స్ఫూర్తితో*

# శ్మశాన విలాపం

శ్మశానమా
ఎందుకలా నిద్రలేని రాత్రులు
గడుపుతున్నావ్
•
బిడ్డల ఆత్మబలిదానాలను చూసి
ఎంతగా విలపిస్తున్నావో కదా!
•
జనాల జే.ఏ.సీ జాతర బైలెల్లింది
కులం లేదు
మతం లేదు
నాలుగు కోట్ల గొంతుకల ఉమ్మడి దండోరా
సిర్ఫ్ తెలంగాణా
•
ప్రవహిస్తున్న నినాదాల సెలయేరు
ప్రత్యేక పాటల బ్రతుకు పోరు
ఒక్కొక్కడు ఓ మరతుపాకి
ఓ నిలువెత్తు సజీవ ఆయుధం
ఓ ప్రశ్నల కొడవలి
•
నాకెందుకు బ్రతుకు లేదు?
నా సదువుల పట్టాలకెందుకు విలువలేదు ?
నా నేలలో నేనెందుకు పరాయివాన్నయ్యాను?
•

అందరిదీ ఒకే మాట
పరుగెత్తే నెత్తుటి తూట

•

అగ్నిగోళాలై మండుతున్న
అమరవీరుల సాక్షిగా
అంతా ఒకటైనాం
నీకిక భయంలేదు

10.11.2010

# నేనొక మట్టి బిడ్డను

నా అడుగులను
పోలీసు డేగకళ్ళు
పహారా కాస్తాయి

•

నా మాటలను
సర్కారు
మిలటరీ సంకేతంలో రికార్డ్ చేస్తుంది

•

నా పాటలకు
ఆస్థాన పండితులు
కొత్త రాగాలను కడుతుంటరు

•

నా చూపుల్ని గుర్తించడానికి
ఐరిష్ కెమెరాలు
శరవేగంతో దూసుకొస్తుంటాయ్

•

ల్యాబొరేటరీలు
నా జన్యుపటాన్ని
సేకరించి భద్రపరుస్తాయ్

•

పోలీస్ ఠాణాల్లో
నేరాంగీకార పత్రాల్లో
నా ప్రమేయం లేకుండానే
నా వేలి ముద్రలుంటాయ్

•

నా ఇంటికి వెళ్ళాలన్నా...
దారి పొడవునా
ఇనుప కంచెలు

•

నేను సాయుధుడిని కాదు
ఉగ్రవాదిని అంతకన్నా కాదు
నేనొక తెలంగాణా బిడ్డని
ఈ మట్టి చెర విడిపించడానికి
పిడికిలి బిగించిన
తెలంగాణా మట్టిబిడ్డని

23.10.2010

# తెలంగాణ కవితా 'నెగడు' రగిలింది!

– డా॥ జిలుకర శ్రీనివాస్

కవిత్వం శుద్ధమైనదేమీ కాదు. అదొక నిర్మాణం. దానికదే ప్రవహించే గుణం కవిత్వం యొక్క స్వభావమే కాని, దానికి మూలం మాత్రం సమాజ చలనశీలతే. అందువల్ల కవిత్వం పరిశుద్ధాత్మల పలవరింత అనుకోవటం ఒట్టి భ్రమ. సాహిత్య క్షేత్రంలో ప్రచలితమై వున్న అనేక కాల్పనిక భావనలు రచనకు భ్రమాపూరితమైన హోదాను కల్పించాయి. సమాజంలోని సాహిత్య ఉత్పత్తికి అనేక కారణాలుంటాయి. వాటిలో వివిధ శక్తుల మధ్య జరిగే సంఘర్షణ ప్రధానం. ఆ శక్తులు ఆపాదించుకొనే రాజకీయ లక్ష్యాలు, వాటి ప్రాసంగికత కవుల మీద లేదా సాహిత్య ఉత్తత్తికారుల మీద తీవ్రమైన ప్రభావం చూపుతాయి. ఆ క్రమంలో కవి నిర్దిష్ట సామాజిక పునాదుల మీద నిలబడి సాధారణీకరించిన వాస్తవికతను అనేక పరిమితులతో వ్యక్తీకరిస్తాడు. పరిమితులు లేని సాధారణీకరణ అసంభవం. అలాంటి సాధారణీకరణ లేదా సార్వజనీనతను సాహిత్యం యొక్క సార్వభౌమత్వంగా ఎవరైనా భావిస్తే ఒక ఆదర్శం మాత్రమే అవుతుంది.

ప్రాదేశిక ఉద్యమాలకు ఉడుకుతనం ఎక్కువ. దుడుకుతనం కూడా కాస్త ఎక్కువే. ఉద్యమం అనేక రంగాలను తగిన మోతాదులో –ఒక్కోసారి మోతాదుకు మించి– ప్రభావితం చేయటమే కాదు, వాటి ప్రవర్తనను, చలనాన్ని, ప్రమేయాన్ని కూడా నిర్ణయిస్తోంటుంది. ఆ రకంగా తెలంగాణ ఉద్యమం సాహిత్య సాంస్కృతిక రంగాలను విశేషంగా ప్రభావితం చేసింది. ఉద్యమం పతాక స్థాయిలో వున్న కాలంలో అనేక మంది కవులు రాసిన రాతలు చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది. వాటిలో వ్యక్తమైన భావావేశం మాటున ఎన్ని పొరపాట్లు దొర్లాయో విమర్శకులు సైతం సరిగా గుర్తించినట్టు లేదు. ముఖ్యంగా తెలంగాణ పాటలు ప్రజల మీద విపరీతమైన ప్రభావం చూపాయి. కాని, పాటల్లో పొందుపర్చిన అంశాలు అనేక దశాబ్దాల తెలంగాణ పోరాట స్ఫూర్తికి భిన్నంగా, ఆదర్శాలకు విరుద్ధంగా వున్నాయి. తెలంగాణ సంస్కృతిని దేవుళ్లకూ దేవతా స్తుతికి పరిమితం చేసిన గీతాలు చాలా వున్నాయి. కవులు కూడా చాలా మంది

అలాగే చేశారు. భద్రాచలం రామదాసు, కోటిలింగాల, కొండగట్టు అంజన్నతో పాటు రాతిబొమ్మల్లోని పరమ శివుడిని ఆత్మహత్యలకు కారణం చేసి కన్నతల్లి దేవుడిని నిందించే వరకూ వెళ్లాయి. తెలంగాణ ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే పాలకుల రాజనీతి పక్కకు పోయి బిడ్డలను కోల్పోయిన కుటుంబాలు దేవుడిని వేడుకొనే పరిస్థితికి నెట్టేశారు కవులు. ఇది నిజంగా తెలంగాణ ప్రాంత స్వభావానికి విరుద్ధమైంది. ఉద్యమం ఏ పునాదుల మీద జరుగుతున్నదనే అంశం మీద ఆధారపడి ఆ సమాజ సాంస్కృతిక సాహిత్య వ్యక్తీకరణలు రూపొందుతాయని దీని వల్ల నిర్ధారణ అవుతోంది.

సాహిత్యం సామాజిక వ్యవస్థ యొక్క కళా వ్యక్తీకరణ. సమాజంలోని అనేక అంశాల అల్లిక కవిత. కవితగా దానికి స్వతంత్రమైన ఉనికి లేదు. కాని, సమాజ మౌలిక స్వభావాన్ని సాహిత్యం వ్యక్తీకరిస్తోందా? లేకా వాస్తవికత పేరుతో కాల్పనికతను లేక అబద్ధాన్ని ప్రదర్శిస్తుందా అనేది గ్రహించాలి. కవుల మానసిక ఉద్విగ్న స్థితికి పెద్ద పీట వేసే అలంకార సంప్రదాయం నుండి విమర్శకులు బయటపడ లేదనేది నిజం. కవుల ఉద్విగ్నత ఒక్కటే కవితా సృష్టికి సరిపోదు. ఆ కవికి వున్న నేపథ్యం కూడా సృజన క్రమంలో కీలకం. అందువల్ల కవులు సామాజిక స్వరూపాన్ని, స్వభావాన్ని పట్టుకొని, దాన్ని నడిపించే చలన సూత్రాన్ని గ్రహించే శిక్షణ మన సాహిత్య రంగంలో లేదు. అందుకే చాలా వరకు ఆధిపత్య సాహిత్య ప్రభావాలకు లోనవుతారు.

కుల సమాజంలో కుల వ్యక్తీకరణలే ఉండాలి. కాని, కులాతీత వ్యక్తీకరణలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. తెలంగాణ ఉద్యమంలో శుద్ధ తెలంగాణ భావనను శూద్ర, అగ్రకులాలు ఎక్కువ ప్రచారం చేశారు. వారికి కవులు వంత పాడారు. ఉద్యమం కులాలకు అతీతంగా సాగుతోందనే ఒక అబద్ధం బలమైన ఆమోదం పొందింది. ఈ భావన వాస్తవ విరుద్ధమైంది. నిజం మరో విధంగా ఉంది. వెలమ, రెడ్డి వంటి శూద్రకులాల నాయకత్వంలో నడిచిన తెలంగాణ ఉద్యమానికి బ్రాహ్మణ తాత్విక చింతనే పునాది. నిరాశ నిస్పృహలనే కాదు పచ్చి స్వార్థపూరితమైన కుత్సితమైన వ్యూహాలను, ఎత్తుగడలనూ ఆచరించేలా అది చేస్తుంది. ఆ ప్రభావంలో పడి కొట్టుక పోయే కింది కులాలను ఏదో ఒక దశలో వంచిస్తోంది.

ప్రవీణ్ ఆ వంచనను సరిగానే గుర్తించాడు. ఆ విద్రోహాన్ని తీవ్రంగానే ఖండిస్తున్నాడు. తెలంగాణ ఉద్యమంలో భావావేశాల కన్న రాజకీయాలే కీలక పాత్ర పోషించాయి. భావోద్వేగాల పరిభాషను చర్చకు

పెట్టినప్పటికీ దాని వెనుక దాగున్న ఉద్దేశ్యం మాత్రం రాజకీయాల గుట్టును ప్రజలు గ్రహించనీకుండా చేసే కుట్రే. అందుకే ఉద్యమం ఉత్థాన పతానాలు కేవలం కాల మహిమ కాదనీ, దైవ సంకల్పం అంతకన్నా కాదనే ఎరుక కవులకు ఉండాలి. పాలక కులాల రాజకీయ క్రీడ ప్రతిఫలమని గుర్తించాలి. అందుకే, తెలంగాణ సాంస్కృతిక వ్యక్తీకరణల రాజకీయాలు నిర్వికల్ప దృష్టితో చూస్తే అర్థం కాదు. వాటిని అర్థం చేసుకోవాలంటే బహుజన తాత్వికతను ఒక చూపుగా అలవర్చుకోవాలి.

చరిత్ర విశ్లేషణకు కూడా ఒక దృక్పథం ఉంటుంది. అది నిరంతరం ఆధిపత్య వర్గాల వల్ల ప్రభావితం అవుతూంటుంది. అందుకు తెలంగాణ చరిత్ర ఒక మచ్చు తునక. తెలంగాణ చరిత్ర పేరుతో రెండే అంశాలు ప్రచారమయ్యాయి. ఒకటి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. రెండు, తెలంగాణ సంస్కృతి. కమ్యూనిస్టులు, బ్రాహ్మణవాదులు దీని ప్రచారకులు.వాస్తవానికీ రెండూ తెలంగాణ చరిత్రను వక్రీకరించే ధోరణులే. ఈ రెండు పద్ధతుల్లో బహుజన చరిత్ర విస్మరణకు గురవుతుంది. వేల సంవత్సరాల భూమి పుత్రుల చరిత్ర తుడిచి పెట్టబడింది. చరిత్రకు పూర్వ తెలంగాణ మానవ సమాజ వికాస విశ్లేషణ నేటికీ జరగ లేదు.

ప్రవీణ్ నెగడు తెలంగాణ కొలిమిలో బాగా మండిన కవితాపుటం. ప్రవీణ్ అనేక ప్రభావాల ఒత్తిడి నుండి బయటపడేందుకు పెనుగులాడుతున్న సందర్భంలోనే ఈ సంకలనం తెస్తున్నాడు. కవితా ద్రవ్యాల గురించి గానీ, లేక పదచిత్రాల సాంద్రత గురించి గానీ బెంగపడటం అనవసరం. అణగారిన వర్గాలకు, ప్రాంతాలకు ఆధిపత్య ప్రమాణాల అనువర్తన ప్రశంసించ లేను. అతడు వేసే అడుగులు ఆధిపత్య వ్యవస్థను కూలదోసి బహుజన రాజ్య నిర్మాణం వైపు సాగుతాయని విశ్వసిద్దాం!

# నేను...

మనం తెలంగాణా ఉద్యమం మలి దశలో ఉన్నాం. తెలంగాణా ఉద్యమం రాజకీయ రూపం తీసుకోవడానికి ఎన్నో సంవత్సరాల సాంస్కృతిక, సాహిత్య కృషి ఉందనేది అక్షరసత్యం. ఏండ్లకేండ్లుగా తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని, అణిచివేతను సాహిత్యకారులు ఎప్పటికప్పుడు తమ రచనల్లో ప్రతిబింబిస్తూనే ఉన్నరు. సాహిత్యకారులే కాకుండా కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాలు ప్రత్యేక రాష్ట్ర సాధన కొరకు ఏండ్లతరబడి పోరాడుతూనే ఉన్నరు. ఇక ప్రజలెప్పుడూ ఈ మట్టి చెర విడిపించడానికి నడుం బిగించే ఉన్నరు. తెలంగాణా కోసం ఎవరు పోరాడినా వాళ్ళతో గొంతు కలిపేందుకు సిద్ధంగా ఉన్నరు. ఇక విద్యార్థి ఉద్యమకారుల పాత్ర మాటలకందనిది. ప్రాణాలను ఫణంగా పెట్టి మరీ  తెలంగాణా విముక్తి కొరకు పోరాడుతున్నరు.

ఐతే తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు అనేది రాజ్యాంగపరమైన రాజకీయ పరమైన ప్రక్రియ. ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించాల్సిన నాయకులు ముందుండడం అటుంచి ఉద్యమకాలంలో ప్రలోభాలకు లొంగి ఉద్యమాన్ని దెబ్బతీసున్నరు. ఇంకొందరు పదవి లేనప్పుడో, పార్టీ బలం పెంచుకోవడానికో ఉద్యమాన్ని లేవదీసి, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడే సమయంలో నోరుమెదపక ఎత్తుగడల ముసుగు తొడుక్కుంటున్నరు.

ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని గగ్గోలు పెట్టే వీళు ్ళ, తెలంగాణా ప్రజల మనోభావాలను ఎప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదు. వీళ్ళకు ఉద్యమం పట్టదు ఎప్పుడూ పదవి ఎలా కాపాడుకోవాలనే ధ్యాసే. వీరి వింత ప్రవర్తన ప్రజలను అయోమయంలో పడేస్తుంది.ఏ పార్టీని, ఏ నాయకున్ని నమ్మాలో తెలియని సందిగ్ధ పరిస్థితి. కేవలం ఈ అవకాశవాద విధానాల వల్లే ఆత్మహత్యలు పెరిగిపోతున్నయ్. మరీ ముఖ్యంగా విద్యార్థి ఉద్యమకారుల బలిదానాలు  ప్రజల పోరాటం, నన్ను బాగా కలచి వేశాయి. దాని ప్రతిస్పందనే 'నెగడు'.

ఇది నా తొలి ప్రయత్నం. ఈ పుస్తకంలో తెలంగాణాకు సంబంధించిన అన్ని అంశాలను కవిత్వీకరించానని నేననుకోను. ఈ పుస్తకంలో రాజకీయ నాయకుల మీద ఎక్కువగా స్పందిండానికి కారణం వారి ద్వంద్వ విధానాలే. ఏండ్లకేండ్లు అణగారిన తెలంగాణాపై కవిగా, పరిశోధక విద్యార్థిగా ఇక ముందూ స్పందిస్తానని ఈ సందర్భంగా మనవి చేసుకుంటున్నాను.

❋

మాది శివనగర్. ఓ వైపు రైలు పట్టాలు, మరోవైపు ఓవర్ బ్రిడ్జి, ఇంకో వైపు హైవే, నాలుగో దిక్కున కాష్టాల గడ్డ ఇవి మా శివనగర్ సరిహద్దులు. ఐతే శివనగర్ జీవితాలెప్పుడూ కాష్టానికి దగ్గరగా ఉంటాయి. తెలంగాణా లాగా. తన చుట్టూ ఉన్న పరిసరాలు ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్ణయింపజేస్తాయనేది నా విషయంలో నిజం. నేను పెరిగిన ఈ పరిసరాలు, జర్నలిస్టుగా పని చేసినప్పుడు చూసిన జీవితాలు మరీ ముఖ్యంగా మా శివనగర్ జీవితాలు నాకు ఆలోచించడం నేర్పాయి. ఈ ప్రాంతంలో ఓ చింతం శాంతవ్వ, ఓ పసునూరి వరమ్మ,వడ్డెపల్లి రాజేశ్వరి లాంటి జీవితాలు నాకు జీవితం పోరాటమనే సత్యాన్ని చెప్పాయి.

❋

నాలో ఉన్న ఆవేశాన్ని, ఆలోచనను అక్షరీకరించమని ప్రోత్సహించిన తలవంచని కవి అన్వర్‌కి మొదట తలవంచి నమస్కరిస్తున్నాను. కవిత్వాన్ని ఎంత సీరియస్‌గా తీసుకుంటడో అంతకు మించి దాన్ని ఆచరణలో పెట్టాలని అనుక్షణం తపించే వ్యక్తి. జీవితాన్ని కోల్పోవడానికి అన్వర్ సిద్దంగా ఉంటాడేమో గాని కవిత్వాన్ని, సాహిత్యాన్ని వదులుకోవడానికి ఇష్టపడడు. మనిషి మాటల్లోనే సున్నితత్వం నిజానికి లోడ్ చేసిన కవిత్వ ఫిరంగి. అన్వర్‌తో నాకు చిన్నప్పటినుండి ఉన్న సాన్నిహిత్యం వల్ల అతన్ని, అతని కవిత్వాన్ని దగ్గర నుండి పరిశీలించే అవకాశం కలిగింది. ఇదే నేను సాహిత్యాన్ని ప్రేమించడానికి, కవిత్వం వ్రాయడానికి ప్రేరణయ్యింది. అన్వర్ నా కవిత్వ మార్గదర్శి.

ఇక యూనివర్సిటీలో నా పర్యవేక్షకుడు,కాకతీయ యూనివర్సిటీ లోనే మచ్చలేని మనిషి ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు గారి దగ్గర నుండి 'సింప్లిసిటీ' నేర్చుకున్నాను. తెలంగాణా సాహిత్యం పైన విశేషమైన కృషిచేస్తూ, తెలంగాణా తెలుగుకథ, తెలంగాణా తెలుగు నవల మీద పరిశోధనలను ప్రోత్సహించడం నేను తెలంగాణా కవిత్వం రాయటానికి మరొక ప్రేరణ.

జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వర్తించడం అనేది నిత్యం ఒత్తిళ్ళతో కూడినది.కానీ సాహిత్య ప్రేమికుడు రచయిత కూడా అయిన డా॥ శేషాద్రి గారు సాహిత్యాన్ని ప్రోత్సహించడాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవటం గొప్ప విషయం. సార్ కోసమన్న కవిత్వం రాయాలన్నంతగా లోపలి మనిషిని తట్టి లేపగలడు. ఓ రోజు నా కవితలను చూసి వెంటనే పుస్తకంగా తీసుకురమ్మని సలహా ఇచ్చి ప్రోత్సహించిన డా॥ శేషాద్రి గారికి కృతజ్ఞతలు.

పుస్తకం వ్రాస్తున్న సందర్భంలోనే కాదు, జీవితంలో అనేక సందర్భాల్లో నన్ను అన్ని విధాల ప్రోత్సహించిన నా చిన్ననాటి మిత్రుడు ప్రజా కళాకారుడు రాజేష్ఖన్నా నాకు దోస్తుగా లభించడం నా జీవితంలో గొప్ప బహుమతి.

జనాల ముందు ఓ నాలుగు మాటలు చెప్పేసి ఆ తరువాత తమ నిజ రూపంలోకి మారిపోతుంటారు చాలా మంది సోకాల్డ్ మేధావులు, ఉద్యమకారులు. కానీ ఏదైతే సిద్ధాంతం తాను నమ్ముతున్నాడో దానికనుగుణంగా తన జీవితాన్ని మలుచుకుని అతి సాధారణ జీవితాన్ని గడుపుతున్న అన్న డా॥ జిలుకర శ్రీనివాస్ సదా నా ఉద్యమ మార్గదర్శి.

ఇంటర్, డిగ్రీ రోజుల్లో నేను చదువుకోవడానికి నాకు స్థైర్యాన్ని, ధైర్యాన్నిచ్చిన మామయ్య అల్లం శంకరయ్య, వడ్డె శ్రీనివాస్లకు, గురువు మెట్టు శ్రీనివాస్కు, మిత్రులు గడ్డం రవి, వడ్డెపల్లి శ్రీకాంత్, మేరుగు అశోక్, మారెల్లి ప్రసాద్, యూనివర్శిటీ మిత్రులు ఈశ్వర్,భాస్కర్,దయాకర్, శంకర్, నాగరాజు,వీరందరికీఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

అడగ్గానే అతి తక్కువ సమయంలో ముఖచిత్రం గీసిచ్చిన మోహన్ సార్‌కి, జీవనగమనంలో అనునిత్యం నా వెనక నిలబడి నన్ను ప్రోత్సహించిన తమ్ముడు గిరి, చాలా ఓపికగా నా కవితలన్నీ డి.టి.పి. చేసిన మిత్రుడు వడ్లకొండ భాస్కర్‌కు. . .

డా॥ గన్ను వెంకటేశ్వర్లు, వడ్డె సతీష్, ఎంబాడి విజయ్, దానబోయిన రవి,చారి, జయశంకర్, గౌస్‌పాషా, సిరిగిరి రవీందర్, కొత్తపెల్లి శ్రీనివాస్, వలస ప్రకాష్, మారేడుపాక రవీందర్, ముత్తినేని పరమేశ్వర్, లక్కర్సు అశోక్‌లకు కృతజ్ఞతలు.